క్లుప్తంగా

కుందుర్పమ్మ ఉత్సవం


పూజలు అందుకున్న కుందుర్పమ్మ

కుందుర్పి: కుందుర్పి ప్రజల ఆరాధ్య దైవం కుందుర్పమ్మ అమ్మవారి ఉత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. ఉదయం అమ్మ వారికి పాలాభిషేకం, కుంకుమార్చన, మధ్యాహ్నం గ్రామోత్సవం, సాయంత్రం అంకురార్పణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు, హోమాలు, తమలపాకుల పూజ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతరాయుడు, సర్పంచ్ రామూర్తి, వార్డు సభ్యుడు మంజునాథ్, మహిళా విభాగం అధ్యక్షురాలు నాగలక్ష్మి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

1 నుంచి రేషన్ పంపిణీ చేయండి

బొమ్మనహాళ్: జూన్ 1 నుంచి రేషన్ షాపులలో సరుకులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని తహసీల్దార్ మునివేలు రేషన్ డీలర్లను ఆదేశించారు. శుక్రవారం దర్గాహొన్నూరు పంచాయతీలోని వన్నళ్లిలో రేషన్ షాపును తనిఖీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ డీలర్లు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 వరకు సరుకులు పంపిణీ చేయాలన్నా రు. వీఆర్ఓ రామన్న తదితరులు పాల్గొన్నారు.

కూడేరులో తాగునీటి ఎద్దడి


పైపులైన్ వద్ద నీరు పట్టుకుంటున్న బోయవీధివాసులు

కూడేరు: మండల కేంద్రంలో వారం రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. బోయ, కటిక, కమ్మవీధి, పీర్ల గుండం, హైస్కూల్ వీధుల్లో ఉండే ప్రజలు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. పంచాయతీ బోరులో నీటి లభ్యత తగ్గిపోయింది. పీఏబీఆర్ డ్యాం నుంచి ప్రాజెక్ట్ వాటర్ సరఫరా కాలేదు. ప్రజలు దూరంలో ఉన్న వేరే కాలనీల వద్దకు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఎడ్ల బండ్లలో వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. మండల కేంద్రంలోనే రోజులు తరబడి నీటి సమస్య నెలకొందంటే అధికారుల పని తీరు ఎలా ఉందో అర్థమవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటు


ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో కోవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేసిన దృశ్యం

ఉరవకొండ: దేశంలో కోవిడ్ కేసులు నమోదవుతుండడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో కోవిడ్ ఐసోలేషన్ వార్డును అధికారులు శుక్రవారం ఏర్పాటు చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చౌదరి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తుగా కోవిడ్ వార్డు ఏర్పాటు చేశామన్నారు. వార్డులో మాత్రలు, ఐసోలేషన్ పరికరాలు కూడా ఏర్పాటు చేశామన్నారు.

కమలాక్షి కుటుంబ సభ్యులకు పరామర్శ


లక్ష్మీదేవమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బ్రహ్మసముద్రం: ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ స్టేట్ మాజీ డైరెక్టర్ కమలాక్షి తల్లి కురుబ లక్ష్మీదేవమ్మ (64) శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గుండిగానిపల్లికి వెళ్లి లక్ష్మీదేవమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమలాక్షి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కోనాపురం గంగాధర, ఎంపీపీ కంబం చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ బసవరాజు, మాజీ జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి అశోక్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మహదేవప్ప, చెలిమేపల్లి ఆంజనేయులు, పోలేపల్లి లోకేష్ తదితరులు లక్ష్మీదేవమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శక్తి యాప్‌పై అవగాహన

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 28వ వార్డు చన్నవీరస్వామి ఆలయంలో శక్తి టీమ్ ఆధ్వర్యంలో మహిళలకు శక్తి యాప్ వినియోగం, మహిళల రక్షణ, భద్రత విషయాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. మహిళల రక్షణ, భద్రత కోసమే ప్రభుత్వం శక్తి టీమ్‌లు ఏర్పాటు చేసిందని, ప్రతి ఒక్కరూ శక్తి యాప్ డౌన్ చేసుకోవాలని రాయదుర్గం పోలీస్ సర్కిల్ శక్తి టీమ్ సభ్యులు హెడ్ కానిస్టేబుల్ నజీర్ తెలిపారు. మహిళా హోంగార్డు అంబిక, మాజీ కౌన్సిలర్ ధనార్జున, కంబ్లి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

- ఏ వీధిలో చూసినా కంకర తేలిన, గుంతల రోడ్లే
- పట్టణ ప్రగతికి కూటమి ప్రభుత్వం చేసిందేమీలేదు
- ఏడాది కాలంలో సీసీ రోడ్లకు రూ.13.50 లక్షల వ్యయం


వర్షం వస్తే కోతలకు గురవుతున్న గౌడ ఇందిరమ్మ కాలనీలోని కచ్చా రోడ్డు


32వ వార్డు సిద్దేశ్వర కాలనీకి వెళ్లే దారిలో ఇలా..

రాయదుర్గంటౌన్: పట్టణ ప్రగతిని కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. ఎన్నికల సమయంలో అభివృద్ధికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చి నేటికీ పట్టించుకోని పరిస్థితి. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా కనీసం సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోలేదు. వీధుల్లో ఓ వైపు కంకర తేలిన రోడ్లు, మరోవైపు మిట్టలు, గుంతలయమైన కచ్చా రోడ్లు.. ఇలా ఏ వీధిలో చూసినా అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పురపాలక సంఘంలో మొత్తం 32 వార్డులు ఉండగా 75 వేల జనాభా ఉంది. పట్టణ పరిధిలో దాదాపు 109 కిలోమీటర్ల పరిధిలో సీసీ రోడ్లు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇందులో 48 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, మరో 61 కిలో మీటర్ల మేర కచ్చా రోడ్లు ఉన్నాయి. ఏడాది కాలంగా సీసీ రోడ్ల నిర్మాణానికి స్కీమ్ నిధులతోపాటు ప్రత్యేక నిధులు పైసా విడుదల చేయలేదు. మరోవైపు పైప్‌లైన్ల కోసం, కొళాయిల కోసం ఇష్టారాజ్యంగా సీసీ రోడ్లను తవ్వుతుండడంతో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గుంతలు పడి రాకపోకలకు ఆటంకం కలుగుతోంది.

అభివృద్ధికి 'కూటమి' తిలోదకాలు:
ప్రస్తుతం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తిలోదకాలిచ్చింది. పట్టణంలోని అనేక వార్డుల్లోని అంతర్గత రహదారులు కంకర తేలి, గుంతలు పడి అధ్వానంగా ఉన్నాయి. మరోవైపు గుంతల రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షాలు వస్తే రోడ్లు కోతకు గురవుతున్నాయి. దుమ్ముధూళితో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. శివారు కాలనీల్లో మరింత ఘోరంగా ఉంది. ఏడాది కాలం నుంచి పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణానికి కేవలం రూ.13.50 లక్షలు మాత్రమే వెచ్చించారు. అది కూడా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఇంటి చుట్టూ రోడ్లు నిర్మిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి పరుగులు..

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు అభివృద్ధిని సైతం పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ హయాంలో స్కీమ్ నిధులు, సీఎండీఎఫ్, గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులు జోరుగా జరిగాయి. ఎన్నో ఏళ్లుగా సీసీ రోడ్లకు నోచుకోని కచ్చా రోడ్లను సైతం సీసీ రోడ్లుగా మార్చారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల హయాంలో రాయదుర్గంలోని 18 సచివాలయాల పరిధిలో డీబీటీ ద్వారా రూ.225 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.144 కోట్లతో అభివృద్ధి పరుగులు పెట్టింది.

వర్షం వస్తే కోతకు గురవుతున్న కచ్చా రోడ్డు



కాలనీలోని ప్రధాన రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వర్షం వస్తే వరద నీరు పారి మట్టి కొట్టుకుపోతోంది. రెండు, మూడు అడుగుల మేర గుంతలు పడి అధ్వానంగా ఉంటోంది. తరుచూ గుంతల్లో వ్యర్థాల మట్టి తోలిస్తున్నారు. వర్షం వస్తే మళ్లీ కోతకు గురవుతోంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మించాలి.
– చాకలి శివ, గౌడ ఇందిరమ్మ కాలనీ, రాయదుర్గం

ప్రత్యేక నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం



మున్సిపాలిటీలో అవసరమైన చోట్ల సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. సీఎం హామీ కింద పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.30 కోట్లకు సంబంధించి డీపీఆర్ తుది దశలో ఉంది. ఇటీవల మంజూరైన రూ.3 కోట్లతో అవసరమైన వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పైప్‌లైన్ సిద్ధం చేశారు. టెక్నికల్ శాంక్షన్ వస్తే టెండర్లు పిలిచి క్షేత్రస్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.
– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

నిధులు కేటాయించకపోతే ఎలా?


మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సమస్యలను ప్రస్తావిస్తున్న కౌన్సిలర్లు చన్నవీర, పద్మజ

రాయదుర్గంటౌన్: పట్టణంలో చిన్నపాటి అభివృద్ధి పనులకూ నిధులు కేటాయించకపోతే ఎలా ? అని ప్రభుత్వ తీరుపై పలువురు కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత కౌన్సిల్ మీటింగ్ అజెండా అంశాలను సిబ్బంది చదివి వినిపించారు. దీంతో పాటు రెండు అంశాలతో కూడిన అత్యవసర టేబుల్ అజెండాను కూడా ప్రవేశపెట్టారు. కౌన్సిలర్లు గోవిందరాజులు, గోవిందు తదితరులు అజెండా అంశాలపై ఉన్న సందేహాలను అధికారుల దృష్టికి తెచ్చి నివృత్తి చేసుకున్నారు. అనంతరం దాదాపు 12 అంశాలతో కూడిన అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం జరిగిన జీరో అవర్స్‌లో పట్టణంలో నెలకొన్న సమస్యలను కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తెచ్చారు.

చిన్నపాటి అభివృద్ధి పనులకూ నిధుల్లేవా?
28వ వార్డు కౌన్సిలర్ గోవిందరాజులు మాట్లాడుతూ మున్సిపల్ డిజిటల్ బోర్డు కోసం అధికారులు రూ.12 లక్షల సాధారణ నిధులు కేటాయించారని, కౌన్సిలర్లు అడిగే చిన్నపాటి అభివృద్ధి పనులకూ నిధుల్లేవంటే ఎలా? అని నిలదీశారు. 24వ వార్డు షబ్బీర్ మాట్లాడుతూ తన వార్డు అభివృద్ధికి నిధులు కేటాయించలేదన్నారు. కౌన్సిలర్లు పద్మజ మాట్లాడుతూ పట్టణంలో వీధి దీపాల కొరత ఉందని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వీధిదీపాలు అందుబాటులో ఉన్నాయని, కౌన్సిలర్లు ఎక్కడ అవసరమో చెబితే ఏర్పాటు చేయిస్తామన్నారు. కౌన్సిలర్లు చన్నవీరప్ప,గోవిందరాజులు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు శ్రీనివాసయాదవ్, వలిబాష, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ రవిప్రకాష్ నాయుడు, టీపీఎస్ మురళీమోహన్, ఏఈ ప్రతాప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, టీపీవో సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారు పేరు 'ఎన్‌సీసీ'

- కర్నూల్ గ్రూప్ కమాండర్ అలోక్ త్రిపాఠి


క్యాడెట్లతో మాట్లాడుతున్న కర్నూల్ గ్రూప్ కమాండర్ అలోక్ త్రిపాఠి

కూడేరు: ఎన్‌సీసీతో సత్ప్రవర్తనతోపాటు క్రమశిక్షణ అలవడుతుందని కర్నూల్‌కు చెందిన ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ అలోక్ త్రిపాఠి అన్నారు. బ్రాహ్మణపల్లి వద్ద ఎన్‌సీసీ నగర్‌లో ఆరో ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ అనంతపురం ఆధ్వర్యంలో సీఏటీసీ–1 ఎన్‌సీసీ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. శుక్రవారం గ్రూప్ కమాండర్ ఎన్‌సీసీ నగర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఆయన క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత క్యాడెట్లకు ఫైరింగ్, డ్రిల్, మార్చ్‌ఫాస్ట్, మ్యాప్ రీడింగ్, ఇతర అంశాలపై ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. క్యాడెట్లకు కల్పిస్తున్న మౌలిక వసతులను తనిఖీ చేశారు. తర్వాత ఆయన క్యాడెట్లతో సమావేశమై మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్లతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఆయన తెలియజేశారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన క్యాడెట్లను గ్రూప్ కమాండర్ అభినందించారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండర్ కల్నల్ ఎంఎస్ కులకర్ణి, లెఫ్టినెంట్ ఎస్.పావని, మేజర్ బల్‌బీర్ సింగ్, జీసీఓలు కైలాస్‌బంకర్, రామచంద్ర, ఎన్‌సీసీ అధికారులు నవీన్ కుమార్, ఎం.ఎండీ ముదస్సర్, ఎం.సంతోష్ , 500 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి


విడపనకల్లులో డ్రైడేపై ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

విడపనకల్లు: ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ వైద్యురాలు పుష్ప, మలేరియా సబ్‌యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ పరిధిలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో డ్రైడే,ఫ్రైడేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం కూడా ప్రతి ఒక్కరూ తమ నివాసాల్లో డ్రైడే పాటించాలని, గ్రామంలో వీధులు గుండా ర్యాలీ చేశారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి, సూపర్‌వైజర్ మునెమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ నూర్ బాషా, స్టాఫ్ నర్సు నిలోఫర్, ఫార్మసిస్టు సరళ,ఆశా వర్కర్లు,శాంతి,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి
రాయదుర్గంటౌన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఆరో సచివాలయం పరిధిలో, గుమ్మఘట్ట మండలంలోని బేలోడులో క్షేత్రస్థాయిలో ఫ్రైడే డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. ప్రస్తుతం వర్షాలుకురుస్తున్న నేపథ్యంలో వారంరోజులకు పైగా నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే పొదుపు అలవర్చుకోవాలి


ఉదిరిపికొండలో పొదుపుపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ శ్రీదేవి

కూడేరు: చిన్నతనం నుంచే ప్రతి ఒక్కరూ డబ్బు పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ శ్రీదేవి సూచించారు. శుక్రవారం ఉదిరిపికొండలో కిశోరి వికాసం వేసవి సెలవులు కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'డబ్బు పొదుపు చేయడం'పై కిశోరి బాలికలకు అవగాహన కల్పించారు. సీడీపీఓ మాట్లాడుతూ డబ్బు పొదుపు అనేది జీవితంలో ఎదగడానికి ఎంతగానో దోహపడుతుందన్నారు. ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్ వైజర్ అరుణ, అంగన్‌వాడీ కార్యకర్త ఉషా, సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రకరూరు: కిశోర బాలికలు బాల్య దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని రాగులపాడు అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బాల్య వివాహాలు, విద్య ఆవశ్యకత, ఆర్థిక నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశఋాలు తదితర అంశాలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ సమితి అధికారి రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఆయాలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేద్దాం


వెంకటాక్షిపతిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేద్దామని వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటాక్షిపతిరెడ్డి తెలిపారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన వెంకటాక్షిపతిరెడ్డిని శ్రీధరఘట్ట గ్రామ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, పెద్ద యల్లప్ప, హనుమంతయ్య, ఆంద్రాల్ యల్లప్ప, అగురప్ప, శేఖర్, వన్నూరుస్వామి, గొల్ల వన్నూరుస్వామి, ఉప్పరల్ వన్నూరుస్వామి, సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


హనిమరెడ్డిపల్లిలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న తహసీల్దార్ షర్మిళ

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ రాజ్యాంగంలోని చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ మునివేలు, ఎస్ఐ నబీరసూల్ సూచించారు. శుక్రవారం మండలంలోని గోవిందవాడ ఆర్డీటీ కాలనీలో గ్రామస్తులతో పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని చట్టాలపై అవగాహన కల్పించారు. వారు మా ట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను రక్షించేందుకు రా జ్యాంగంలో ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. . ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉం డాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. సర్పంచ్ వన్నూరుస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత కుమారి పాల్గొన్నారు.

బెళుగుప్ప: ఎస్సీ,ఎస్టీ చట్టాలను దుర్వినియోగం చేయకూడదని తహసీల్దార్ షర్మిల అన్నారు. శుక్రవారం మండలంలోని హనిమరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో ఎస్ఐ శివతో కలిసి పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రాథమిక హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యుడు మోహన్, సర్పంచ్ మారుతమ్మ, మాజీ సర్పంచ్ గోవిందు, వీఆర్ఓ మధుసూదన్, గ్రామస్తులు ఎర్రిస్వామి పాల్గొన్నారు.

పాదయాత్ర విజయవంతం కావాలని ప్రార్థనలు


అప్పిలేపల్లి మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కళ్యాణదుర్గం: మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య ఆర్డీటీ పరిరక్షణ కోసం చేస్తున్న పాదయాత్ర విజయవంతం కావాలని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ ముస్లిం, మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో పలు మసీదుల్లో నమాజ్ సమయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాదయాత్రకు ఎలాంటి అడ్డంకులు లేకుండా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అల్లాహ్ అంతా మంచి చేయాలని ప్రార్థనలు చేశారు.

నేడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు:
మాజీ ఎంపీ, పీఏసీ సభ్యుడు, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని చేస్తున్న పాదయాత్ర విజయవంతం కావాలని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేయనున్నట్లు మున్సిపల్ కన్వీనర్ ఐ.సుధీర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు పూజకు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

కళ్యాణదుర్గం రూరల్: ఆర్డీటీ పరిరక్షణకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేద్దామని న్యాయవాదులు పిలుపునిచ్చారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు హనుమంతురెడ్డి, కార్యదర్శి దాదాఖలందర్ మాట్లాడారు. ఆర్‌డీటీ ఎఫ్‌సీఆర్‌ను రెన్యూవల్ చేయాలని కోరుతూ సమన్వయకర్త రంగయ్య బెలుగుప్ప మండలం గొంచితండా నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా 209 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేస్తున్నారన్నారు. ఈ పాదయాత్రకు కళ్యాణదుర్గం లాయర్లు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో లాయర్లు ఎర్రిస్వామి, బీటీ రామాంజనేయులు, రవి, హరి ప్రకాష్, తులసీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: ఆర్‌డీటీని పరిరక్షించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య చేస్తున్న పాదయాత్ర విజయవంతం కావాలని సర్పంచ్ అతావుల్లా ఆధ్వర్యంలో ముస్లింలు శుక్రవారం అప్పిలేపల్లిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లింలు ఫకృద్దీన్, దాదాఫీర్, దీనాసాబ్, షఫీ, ఇబ్రహీం, హర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే ప్రశాంత జీవనం

రాయదుర్గంటౌన్: మానసిక ఆరోగ్యానికి, ప్రశాంత జీవనానికి యోగా ఏకైక మార్గమని ఎంపీడీఓ కొండన్న తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర- 2025లో భాగంగా యోగా సాధన చేశారు. ఎంఈఓ-2 వెంకట రమేష్, కార్యాలయ, ఎన్ఆర్ఈజీ ఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు యోగా సాధన చేశారు.

యోగాతో ఆరోగ్యం పదిలం
గుమ్మఘట్ట: యోగాతో ఆరోగ్యం పదిలమని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయాల సిబ్బంది, కార్యాలయ సిబ్బందికి యోగాపై శిక్షణ ఇప్పించారు. ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ జయరాములు, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, ఆయుర్వేదిక్ వైద్యురాలు రాధాకుమారి, గ్రామ సచివాలయాల సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

4న వెన్నుపోటు దినం

కళ్యాణదుర్గం రూరల్: జూన్ 4న సీఎం చంద్రబాబు వెన్నుపోటు దినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆర్‌డీటీ ఆస్పత్రి నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య తెలిపారు. అనంతరం ఆర్డీఓ వసంతబాబుకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారం కోసం నోటికొచ్చిన అలవిగాని హామీలు ఇచ్చి, తుంగలో తొక్కిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త తలారి రంగయ్య ఆ ప్రకటనలో విమర్శించారు. నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అన్ని వర్గాల వారు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంత చేయాలని పిలుపునిచ్చారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోండి

కూడేరు: సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలకోసం రైతులు శనివారం నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ విజయకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి కే6 రకం 2,000 క్వింటాళ్లు, టీసీజీఎస్ 1694 రకం 100 క్వింటాళ్లు కేటాయించినట్లు తెలిపారు.

రాయదుర్గంటౌన్: విత్తన వేరుశనగ కాయల కోసం రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ మహేంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నారు. రాయదుర్గం మండలానికి కే6 రకం 2,800 క్వింటాళ్లు, లేపాక్షి రకం 200 క్వింటాళ్ల వేరుశనగను ప్రభుత్వం కేటాయించినట్లు చెప్పారు.

బొమ్మనహాళ్: 40శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేయనున్నట్లు ఏఓ సాయి కుమార్ శుక్రవారం తెలిపారు. మండలానికి 500 క్వింటాళ్లు విత్తన కాయలను కేటాయించినట్లు తెలిపారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో వేరుశనగ విత్తన కాయల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన

కుందుర్పి: వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జంగం శ్రీనివాసులు కళాబృందం హెచ్‌ఐవీ–ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల కేంద్రంలో అవగాహన కల్పించారు. ఎయిడ్స్‌తో పాటు క్షయ, సుఖవ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, హెచ్‌ఐవీ యాక్ట్ 2017, టోల్‌ఫ్రీ నంబర్ 1097 గూర్చి స్థానిక వైద్యాధికారిణి చాంద్‌బేగం వివరించారు. కార్యక్రమంలో రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎన్ఎం అనుసూయ, సర్పంచ్ రామూర్తి, ఓఆర్‌డబ్ల్యూ యశోద, భాగ్యమ్మ, వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కోఆర్డినేటర్ హనుమంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

విడపనకల్లు: ఉండబండ వీరభద్రస్వామి ఆలయంలో ఈఓ విజయ్‌కుమార్ సమక్షంలో హుండీ కానుకలు శుక్రవారం లెక్కించారు. పది నెలలకు గాను రూ.12,63,028 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. పాల్తూరు ఎస్ఐ ము రహరి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

కళ్యాణదుర్గం: రైతులు పంటల సాగు విషయంలో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ చంద్రాయుడు సూచించారు. శుక్రవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మండలం పాలవాయి, మల్లాపురం, కంబదూరు మండలం తిమ్మాపురం, ఓబిగానిపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంటల సాగులో పాటించాల్సిన సాగు పద్ధతులపైన, ఉద్యాన వన శాఖ, పశు సంవర్థక శాఖ శాస్త్రవేత్తలు పలు అంశాలపైన అవగాహన కల్పించారు. అధికారులు గౌసియా, అరుణ, శ్వేత, శాస్త్రవేత్తలు బాలాజీ నాయక్, మల్లికార్జున, శిరీష, యుగంధర్, రైతులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి


గౌసే ఆజం దర్గా మసీదులో విద్యార్థులకు ప్రోత్సాహకాలు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

రాయదుర్గంటౌన్: విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు ఆధ్యాత్మికత, నైతిక విలువలు అలవర్చుకోవాలని ప్రభుత్వ ఖాజీ సైఫుల్లా, మౌలానాలు మహమ్మద్ నూర్, ఏజాజ్ ముస్తఫాలు పిలుపునిచ్చారు. పట్టణంలోని మక్కా మసీదు, ఖుబా మసీదు, జామియా చౌక్ మసీదు, గౌసే ఆజం దర్గా మసీదు, టిప్పు మసీదు, నూరే మదీనా మసీదు, అహమ్మద్ రజా మసీదుల్లో నెల రోజులపాటు నిర్వహించిన ఇస్లామిక్ సమ్మర్ క్యాంపులు (మర్హబ్) శుక్రవారంతో ముగిశాయి. శుక్రవారం టిప్పు మసీదులో ముగింపు సదస్సు జరిగింది. అనంతరం ప్రోత్సాహక బహుమతులు అందించారు.

ఉత్సాహంగా యోగా పోటీలు

ఉరవకొండ: పట్టణంతోపాటు గ్రామాల్లో యోగాంధ్ర–2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యోగా పోటీలు ఎంతో ఆసక్తికరంగా సాగాయి. స్థానిక షిర్డీసాయి కళ్యాణమంటపంలో యోగా గురువులు వెంకట్‌తాడికొండ పర్యవేక్షణలో విద్యార్థులు యోగా విన్యాసాలు చేసి చూపించారు. ఎంపీడీఓ రవిప్రసాద్, ఈఓ గౌస్‌సాహెబ్ మాట్లాడారు.

నేడు పింఛన్ పంపిణీ

బొమ్మనహాళ్: మండలంలో శనివారం నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో 6,411 ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు గాను రూ.2.84 కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.